# సుబ్బారావు సైకిల్

**— దేవేంద్ర**

సుబ్బారావు రుస రుస లాడుతూ బుసలు కొడుతున్నాడు. కారణం...... తన ఇంట్లోనూ, ఆఫీసులోనూ...... అంతా...... ఆఖరికి, తన ఏకైక పుత్ర రత్నంతో సహా...... వెధవలంతా... తనని బొత్తిగా 'కేర్' చెయ్యడం లేదు! ఆ చరిత్ర హీనులెవ్వరికీ సుబ్బారావు పూర్తి చరిత్ర తెలిచ్చావదు. తెలియదుపో......... తెలియజెప్తామంటే విని చావరు! వెధవ ఖానాలు......... సుబ్బారావు లాంటి కీర్తి శేఖరుడ్ని గేలి చేసి గాలిలో కల్సిపోతారెప్పుడో!

అసలు సుబ్బారావుగారంటే ఎవరనుకున్నారు?...... మరాఠీ మహారాజు, డాల్ ఆఫ్ ఇండియా, రావుబహద్దర్, రాయల్ కింగ్ శ్రీ శ్రీ శ్రీ విక్రమ సింహమహారాజా వారి ఏకైక హెడ్ దివాన్జీ, హిజ్ డిగ్నిటీ ఆఫ్ బాంబే కీ. శే. కె.ఎల్.ఎం.ఎన్.కె.ఎఫ్. మూర్తి, బారెట్ లా ఇన్ లండన్‌గారి ఏకైక కుమారరత్నం! అటువంటి గ్రేట్ హిస్టరీ ఉన్న యువ దివాన్ సుబ్రావ్‌జీని, అతని ఆఫీసులో కొత్తగా చేరిన నవ జవాన్ సైతం 'ఏబ్రాసి సుబ్రావు' అని చాటుగా ఏడిపిస్తారు.

ఔరా! —ఇదెంత... అన్యాయం? ఈ వెధవ డెమోక్రసీ లేకుంటే, ఆ ఆఫీసు పీనుగులంతా ఈ పాటికి......... సుబ్బారావు పాదాలు పిసుకుతూనో, గొడుగు పట్టుకునో, తల పాగా సరి చేస్తూనో, కోటు, హ్యాటు కలిపి భుజాల మీద మోస్తూనో, నశ్యం డబ్బీ అందిస్తూనో......... కాలికింద నల్లుల్లా పడి వుండే వారు.

కానీ, ఏం లాభం?...... ఈ దిక్కుమాలిన డెమోక్రసీ పుణ్యమా అని రాజులూ పోయారు. దివాన్లంతా దిక్కులు పట్టిపోయారు. దాంతో... సుబ్బారావు లాంటి ఎడ్యుకేటెడ్ గ్రాడ్యుయేట్ కూడా మండలం ఆఫీసులో కమండలం, కలం పట్టుకుని...... గుమాస్తా అయిపోయాడు. కాలానికి పోయే కాలం కాకపోతే...!

మిసెస్ సుబ్బారావు పేరు సుబ్బలక్ష్మి...... పేరుకు తగ్గట్టే, దిబ్బ కుదుంలా, పొట్టిగా...... కాకిగొయిలు లాంటి హెయిర్ స్టయిలూ...... గూబ కళ్ళూ, ఎత్తు పళ్ళూ......! పాపం, మహా సాధ్వి! పూర్వజన్మలో ఎంత పున్నెం చేసి బ్యాంకులో దాచుకుందో తెలియదుగాని......... సుబ్బారావు లాంటి చరిత్ర పురుషుడి వైపయి చరిత్ర కెక్కింది.

చానాళ్ళ క్రితం...... ఓ శుభ ముహూర్తంలో సుబ్బలక్ష్మి చూపు, సుబ్బారావు సొగసైన హిట్లర్ మీసకట్టు మీద పడి...... దానిమీదే ప్రేమ గూడు కట్టుకొని గుడ్లు పెట్టింది. ఆ ప్రేమ, సుబ్బారావు గుండెలో తొలుత తేమను రేపి, తుదకు తుమ్మ బంకల్లా సాగ నారంభించింది. ఈ బంక బంధపు బలమైన ప్రేమకు సుబ్బారావు లొంగిపోయి, సుబ్బలక్ష్మితో పార్కులో గడ్డి పీకుతూ, బీచిలో ఇసుక పిసుకుతూ...... సైడ్యూయెట్లు మొదలెట్టాడు.

చిన్నప్పట్నుండీ నిక్కరు తడుపుకోకుండా తప్ప, నాన్నతో తిన్నగా ఎలా మాట్లాడాలో తెలియని సుబ్బారావు......... తండ్రి చరిత్ర కన్నా విలువైన తన ప్రేమ గురించి ఎలా చెప్పాలో అర్థం కాక తనలోనే కుమిలి కుమిలి పోతుంటే......... ప్రియుడ్నుద్ధరించ... ప్రియుద్ధర్థం చేసుకున్న సుబ్బలక్ష్మే చొరవచేసి తన తండ్రికి విషయం ఊదేసింది.

కానీ కట్నం లేకుండా కూతుర్నెలా దులుపుకోవాలా అని మరీ పీనాసిగా ఆలోచించే సుబ్బలక్ష్మి తండ్రి, 'కాణాచి కాంతయ్య' రబ్బరు బెలూన్లా ఉబ్బితబ్బిబ్బయ్యాడు సుబ్బు మాట విని.

తన కొడుకు లాంటి ఏబ్రాసి వెధవకు, ఏ పింజారీ పిల్లనివ్వడని బెంగపెట్టుకున్న ఎక్స్ దివాన్ గారు......... పిల్లనిస్తాననొచ్చిన సుబ్బలక్ష్మి తండ్రిని వెర్రివాడ్లా చూసి......... సంతోషాన్ని చంకలోనే దాచుకుని, పెళ్ళికి ఒప్పేసుకున్నాడు.


అలా సుబ్బలక్ష్మి, సుబ్బారావు పుణ్య దంపతులై పోయారు!

ముహూర్త ఫలమో, దేవతల దీవెన బలమో తెలీదుగాని, పెళ్ళైన కొన్నాళ్ళకే...... ఎంచక్కా, సుబ్బారావు తాలూకాఫీసులో గుమాస్తా గాను, సుబ్బలక్ష్మి పి.డబ్ల్యు.డి.లో సూపర్ వైజరుగాను ఉద్యోగాల్లో దూరిపోయారు. మరి కొన్నాళ్ళకు వారికి రామేశం అనే నలుసు పుట్టుకు రావడం, తల్లి ఏనాడో పోగా......... మిగిలిపోయిన సుబ్బారావు తండ్రి నిగడదన్ని నులక మంచం తన్నెయ్యడం జరిగింది.


అయితే తండ్రి పోయేటప్పుడు, కుటుంబ ప్రతిష్ఠకు సంబంధించి సుబ్బారావుకి కొన్ని ముఖ్య విషయాలు చెప్పి మరీ పోయాడు. 'ఎక్స్ దివాన్‌గా తానేమీ వెనకేయక పోయినా, తాను ప్రాణపదంగా చూసుకునే మాజీ రాజుగారి సైకిలు, తన దివాను పాగా, కోటు; ఇంగ్లాండు రాణి తనకు బహూకరించిన వాచీ, చేతి కర్ర, హ్యాటు, ఆల్బం......... అన్నిటినీ భద్రంగా కాపాడమని. అదే కొడుక్కి తాను వారసత్వంగా ఇచ్చే ఆస్తి అని......'

రాముడంతటి పితృవాక్పరిపాలకుడైన సుబ్బారావు అట్లాగే తండ్రి వస్తువుల్ని జాగ్రత్తగా చూసుకొంటున్నాడు. తండ్రిగారి జ్ఞాపకార్థం ప్రతి శని వారం ఆఫీసు ఎగ్గొట్టి మరీ ఆ అద్భుత వస్తువుల్ని భక్తితో కొలిచేవాడు.

పులి లాంటి మాంగారు పడెన్‌గా పోయేటప్పటికి సుబ్బలక్ష్మి, సుబ్బారావుపై కొద్ది కొద్దిగా విరుచుకు పడ్డం మొదలెట్టింది. రాన్రానూ, సుబ్బలక్ష్మి ప్రవర్తన శృతిమించి రాగాన పడింది. తల్లివి




ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 24-8-90



చూసి రామేశం కూడా తండ్రిని చిన్నబుచ్చడం మొదలెట్టాడు.

అందుకే సుబ్బారావంతలా రుస రుస లాడుతున్నాడు, కొడిగట్టిన లాంతర్లా.........!

పెళ్ళయిన కాడ్నుంచీ......... సుబ్బారావు రోజూ తన ప్రేమతో పాటు, తన చరిత్ర కూడా కొంచెం కొంచెం మారి భార్య చెవిలో పోస్తున్నాడు, ఆమె నిద్రపోయాక. కాని, ఏం లాభం, అర్థం చేసుకోదా పిచ్చిది!

* * * *

సుబ్బారావుకి ఎనిమిదేళ్ల వయస్సు దాకా, అతని తండ్రి మరాఠీ మహారాజు గారి చీఫ్ దివాన్‌గా పనిచేసేవాడు. రాజావారి చేతికిందున్న ఏభై అరవై జమీల్నీ, జమీందారుల్నీ అజమాయిషీ చెయ్యడం ఆయన పని. ఆ రోజుల్లో...... దివాన్‌గారి నాలు గుర్రాల బగ్గీ వస్తుంటే చాలు......... జనమంతా పక్కకు తప్పుకొని వినయంగా నమస్కరించేవాళ్ళట. ఎంతో మంది భూస్వాములు, పొరుగు రాజులు, బ్రిటిష్ అధికారులు దివాన్‌గారి స్నేహం సంపాయించాలని పడిగాపులు పడేవారట, తద్వారా రాజుగారితో పనులు జరిపించుకోవచ్చని!

సుబ్బారావు తండ్రి రాజావారితో కలిసి ఆయన దివానుగా ఇంగ్లాండు, ఫ్రాన్స్...... వగైరా దేశాలన్నీ చుట్టొచ్చారట. ఓ సారి ఇంగ్లాండు మహారాణి రాజావారి గౌరవార్థం విందు చేసినప్పుడు. అద్భుతమైన ఓ సైకిలు ఆయనకు బహూకరించి, 'డాన్ ఆఫ్ ఇండియా' బిరుదు నిచ్చి సగౌరవంగా సాగనంపారట! అప్పుడే కాబోలు......... బ్రిటిష్ రాణి దివాన్‌గారికో ఖరీదైన వాచీ, కోటు, హ్యాటు ప్రెజెంట్ చేశారు.

కారు కొన్నాక రాజావారు బ్రిటిష్ రాణీగారిచ్చిన సైకిల్ని దివాన్‌గారికి బహూకరించారు. అదే మన హీరో సుబ్బారావు కస్టడీలో వున్న హిస్టారికల్ సైకిల్!

హఠాత్తుగా దేశానికి స్వతంత్రం ప్రకటించడంతో రాజ్యాలన్నీ రద్దయిపోయి, రాజా వారు గద్దె దిగేశారు. రాజ్యం పోయిన బెంగతో రాజా వారు మాజీగా జీవించలేక ఇంగ్లాండు యువరాజు బహూకరించిన 'జోడు గుళ్ళ తుపాకీ'తో కాల్చుకుని హరీమన్నారు. ఆయన తర్వాత......... ఆయన భార్యలు, కొడుకులు వాటాల కోసం జుట్లు పట్టుకొని కోర్టుకెక్కారు. మాజీ దివాన్‌గారి సంగతి రాజ కుటుంబీకులెవరూ పట్టించుకోకపోవడంతో, ఆయన ఆంధ్రాలో తన స్వంతూరు వచ్చేసి కౌలుకి తీసుకున్న నిమ్మ తోటకు నీళ్ళెట్టుకుంటూ కూర్చున్నారు.

అప్పటికి సుబ్బారావు బాగా చిన్నవాడైనా దివాన్‌గా తండ్రి విషయాలన్నీ అతనికి బాగా గుర్తున్నాయి.

బుల్లి సుబ్బారావు అప్పుడప్పుడూ బడెగ్గొట్టి చీమిడి ముక్కు నాలుకతో నాక్కుంటూ.........



తండ్రి గుర్రబ్బగ్గీలో రాజావారి పేలస్‌కి వెళ్ళేవాడు. తండ్రి రాజావారితో......... వ్యవహారాల్లో తలమునకలవుతుంటే, సుబ్బారావు పేలస్ అంతా తానొక్కడే తెగ తిరుగుతుండేవాడు......... రాజావారి పెంపుడు కుక్కల బొచ్చు పీకుతూ! అప్పుడు ఇంగ్లాండు స్కూల్లో చదివే రాజావారి అబ్బాయిలు సుబ్బారావుని పిలుచుకు పిలిచి, కుక్క బిక్కిలతో పార్టీ ఇచ్చేవారు. సుబ్బారావు వారితో కలిసి బిలియర్డ్స్ ఆడేవాడు. కాళ్ళిరగ్గొట్టుకోకుండా క్రికెట్ కూడా ప్రాక్టీస్ చేసేవాడు.

ఇలా చెప్పుకుంటూ పోతే, బోల్డు గొప్పలున్నాయి సుబ్బారావుకి! కాని, విని చచ్చే దెవరు? అక్కడికీ, చరిత్రలోని కొన్ని అతి ముఖ్య సన్నివేశాల్నే ఓ పది డబ్బాల్లో దాచుకొని తిరుగుతుంటాడు సుబ్బారావు, ఎవరైనా తెలియని వాడు కనబడితే తెరేసి రీలు తిప్పేద్దామని!

మొదట్లో దుంపల బళ్ళో చదివేటప్పుడు సొంతం మూకీ రీలేసేవాడు, మాట్రాలని నత్తితో! తర్వాత హైస్కూల్లో కొచ్చాక 'బ్లాకండ్ వైట్' టాకీ మొదలెట్టాడు. లాభం లేదని, కాలేజీలో చేరాక 'కలర్ రీళ్ళు' తిప్పేవాడు. ఇప్పుడు, మోడ్రన్ కాలానికి తగ్గట్టు సెవెంటీ ఎమ్మెమ్ రీళ్ళు 'సిక్స్ ట్రాక్' సౌండుతో తిప్పుతున్నా, అతని చరిత్రెవ్వరికీ నచ్చడం లేదు. పైగా, రీలు తిప్పి తిప్పి జనం ముందు తనే చులకనయిపోతున్నాడు!

అందుకేసుబ్బారావంతలా ఫైరయిపోతున్నాడు.

మొన్నటికి మొన్న సుబ్బలక్ష్మితో పెద్ద పేచీ!......... సుబ్బారావు తండ్రి అతనికి వారసత్వంగా ఇచ్చిన రాజావారి సైకిలు ఇంట్లో అడ్డంగా ఉందట. దాన్ని తీసి బైటకు గిరాటేస్తానంది. అక్కడికీ, సుబ్బారావు వివరంగా చెప్పాడు. అది మామూలు వెధవ సైకిలు కాదు ఇంగ్లాండు మహారాణీ తాలూకా అని! అయినా, సుబ్బలక్ష్మి అతని మాట విన్పించుకోక సైకిలు ఇంటి ముందు బైట పెట్టించింది.


ఆ సైకిల్ని జీవితాంతం కాపాడతానని తండ్రికి మాటిచ్చిన సుబ్బారావు పెద్ద కర్ర పట్టుకొని చలిలో వణుక్కుంటూ, వానకు తడుస్తూ ఆ సైకిలు దగ్గర రాత్రుళ్ళు కాపలా పడుకోవడం మొదలెట్టాడు. పగలు తానింట్లో ఉండడు కాబట్టే, సేఫ్టీ కోసం సైకిల్ని లాకు మీద లాకు చొప్పున ఏడెనిమిది తాళాలేసి, బొడ్లో తాళం చెవుల్దోపుకుని తిరిగేవాడు. ఆఫీసరు వాయదిద్దుతున్నా దులిపేసుకొని, చూస్తున్న ఫైలొదిలేసి గంటకోసారి సైకిల్ని చూసి పోతుండేవాడు.

అప్పుడప్పుడు గాడిదలు, కుక్కలు సైకిలు సరిహద్దుల్లో ఎక్కడైనా కనిపిస్తే ఇనుప చైనుతో వాటిని ఛేజ్ చేసేవాడు, బంగారు సైకిల్ని అవెక్కడ ఖరాబు చేస్తాయోనని! ఈ వ్యవహారమంతా చూసి ఆఫీసు జనమంతా సుబ్బారావుకి పిచ్చెక్కిందని చెప్పుకున్నారు. అతను చెప్పే చరిత్ర వినకుండా!

బొత్తిగా తనను వొదిలేసి, సైకిలే పెళ్ళాంగా భావించి తిరుగుతున్న సుబ్బారావుని చూసి సుబ్బలక్ష్మికి చిర్రెత్తుకొచ్చింది.

పైగా, "ఏవండీ! ఇద్దరం ఉజ్జోగం చేస్తున్నాం; ఓ చేతక్ తీసుకోండి. ఎంచక్కా ఎద్దునెక్కిన పార్వతీ పరమేశ్వరుల్లా ఆఫీసు కెళ్ళొచ్చు" అని చిలక్కి చెప్పినట్టు చెప్పినా విన్పించుకోడా మొగుడు.

తను డొక్కు సైకిలెక్కి ఆఫీసుకెళ్తున్నాడు సరే, "సుబ్బూ! నువ్వు కూడా సైకిలెక్కు, ఎంచక్కా మీ ఆఫీసు కాడ డ్రాప్ చేస్తా" అని ముసి ముసిగా చెప్తుంటే కసి రేగుతుంది సుబ్బలక్ష్మికి.



రాన్రానూ, సుబ్బలక్ష్మి కసి బుసగా మారి హింసై కూచుంది సుబ్బారావు పాలిట! గుమాస్తా కంటే, సూపర్‌వైజరు ఉజ్జోగమే గొప్ప కాబట్టి సుబ్బారావే ఇంటిపని, వంట పని చూడాలని శాసించింది. మాట వినకపోతే అప్పడాల కర్రతో 'థర్డ్ డిగ్రీ' ప్రయోగిస్తానని వార్నింగిచ్చింది. చెయ్యి నని ఎదురు తిరిగితే, కట్నం తేలేదని తనను సుబ్బారావు హింసిస్తున్నట్టు టూ టౌన్ స్టేషన్లో కేసు పెడ్తానని హెచ్చరించింది. అసలే, సుబ్బలక్ష్మి వేలువిడిచిన పినతల్లి కొడుకు, 'కోర మీసాల రత్తయ్య' డియెస్పీ! పోలీసులనగానే మరీ భయపడి పోయి, తన చింపిరి చరిత్రకు చింతిస్తూ వంట పన్లోనూ, ఇంటి పన్లోనూ బిజీ అయిపోయాడు సుబ్బారావు.




**అపోహ:**— బిడ్డలకు ఎంత త్వరగా ఘన పదార్థాలు అలవాటు చేస్తే అంత మంచిది. వాటి వలన వారి కడుపు సుష్టుగా వుండి, రాత్రంతా ఏడ్పించకుండా నిద్రపోగలరు.

**వాస్తవం:**— వీనింగ్ లేదా ఘన పదార్థాలు అలవాటు చేయడం బిడ్డలకు సాధారణంగా 4 నుంచి 6 నెలల మధ్య మొదలు పెట్టడం సబబు. ఎందుకంటే, నాలుగు నెలల వరకు తల్లి పాలే బిడ్డకు కావలసిన అన్ని పౌష్టిక ఆహార పదార్థాలు సమకూర్చగలవు కనుక. అంతకు ముందే ఘన పదార్థాలు మొదలుపెట్టడం వలన 'విరేచనాలు' వంటి జబ్బులు, కడుపు నొప్పి కలగడం, పిల్లలు అతిగా లావెక్కడం, ఆ ఘన పదార్థాలకు ఎలర్జీలు కలగడం ఎగ్జిమా అనే చర్మ వ్యాధి బయల్పడడం వంటి అనర్థాలు కలుగవచ్చు.

ఆరు నుంచి పది నెలల పిల్లలు ఎక్కువ ఆకలి కలిగి రకరకాల ఆహార పదార్థాలపై ఆసక్తి చూపిస్తారు. ఈ సమయమే పిల్లలకు క్రొత్త ఆహారాలు అలవాటు చేయడానికి సరియైన సమయాలు. ఏడాది గడిచాక పిల్లలు చాలా అల్లరికి అలవాటు పడి, తిండి వద్ద పేచీలు మొదలుపెడతారు. ఈ వరుసలో క్రొత్త ఆహారాలు తినిపించడం చాలా కష్టం.

— డా. సి.యస్.యన్.విఠల్,

అశ్విని పిల్లల వైద్యశాల, విజయవాడ-2.

ఇదే మంచి అదననీ, ఎప్పట్నుంచో రచయిత్రినవ్వాలని 'త్రీ'డి' కలలుకంటున్న సుబ్బలక్ష్మి ఓ బండెడు పాత నవల్లు తూకానికి కొని, వాటన్నిటినీ కాపీకొట్టి కొత్త నవల రాయడం మొదలెట్టింది.

సుబ్బారావుని మరీ ఏడిపించాలని సుబ్బలక్ష్మి లోన్లో ఓ లూనా కొంది. మొగుడు మసిబారిన మోముతో ఓటి సైకిలుపై ఈడ్చుకుంటూ వెళ్తుంటే, తాను ఝామ్మంటూ పక్కింటి కాలేజీ స్టూడెంటుకి లిఫ్ట్ ఇచ్చి మరీ ఆఫీసుకు పోతోంది.

కొంపదీసి సుబ్బలక్ష్మి తనకు విడాకులిచ్చి, ఆ కాలేజీ కుర్రాడితో లేచిపోతుందేమోనని దిగాలుపడి, ఇంట్లోనే సైకిలొదిలేసి సుబ్బారావు కూడా పెళ్ళాంతో కలిసి లూనామీదే ఆఫీసుకు వెళ్లటం మొదలెట్టాడు. దెబ్బకు దెయ్యం దిగివచ్చినందుకు సుబ్బలక్ష్మి పక్కింటి స్టూడెంట్‌కి 'థ్యాంక్స్' చెప్పింది.

ఇంట్లో మమ్మీ పని డాడీ చేస్తుండటం గమనించిన రామేశం 'డాడీని డామినేట్ చెయ్యడానికిదే మంచి సందు' అనుకున్నాడు. వాడికసలు డాడీ అంటే కొట్టాలన్నంత కోపం. 'తనకి మోడ్రన్‌గా రమేష్ అని పేరెట్టకుండా, పిలక పంతుళ్ళ పిల్లల్లాగా 'రామేశం' అని పిలుస్తున్నందుకు! తనను ఎంచక్కా కాన్వెంటుకి పంపించకుండా 'దుంపల బళ్ళో' చదివిస్తున్నందుకు!

ఓనాడు సుబ్బారావు వంటింట్లో ముసుగేసుకుని అంట్లు కడుగుతున్న టైం చూసి రామేశం సుబ్బలక్ష్మి దగ్గర డోక్కోబోయేవాడ్లా మొహం పెట్టి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలెట్టాడు. 'దివాన్‌గారి మనవడైతే తన్నా దిక్కుమాలిన దుంపలబళ్ళో రంపపుకోతకెందుకు పంపిస్తున్నారని' సీరియస్‌గా సీరియల్ రాస్తున్న సుబ్బలక్ష్మి మోకాలు మీద కూచుని శోకాలు పెడ్తున్న కొడుకుని చంకకెత్తుకుని, తన జీతంతో పబ్లిక్ స్కూలుకి పంపిస్తానని, వాడి చీమిడంతా తన చీరకు తుడుచుకుని మరీ ఓదార్చింది.

కొడుకు ముందు తాను జీరో క్యాండిలై, సుబ్బలక్ష్మి హైహ్యాండయి పోతున్నందుకు సుబ్బారావు భయపడి, తన తండ్రిచ్చిన రాజావారి సైకిలు కొడుక్కి గిఫ్టిచ్చి దాని మీద పబ్లిక్ స్కూలుకెళ్ళమన్నాడు.

ఆసైకిలుకున్న టైర్లు రెండూ రా రబ్బరుతో చేసినవి. దాన్ని నడిపించడం కూడా రామేశం వల్లకాలేదు. సంగతి విన్న సుబ్బారావు ఆ టైర్లూడదీసి అటకెక్కించి, కొత్త ట్యూబ్ టైర్లు సైకిలుకి బిగించి దాన్ని 'గాళ్‌ఫ్రెండ్'లా చూసుకోమని కొడుక్కప్పగింతలు పెట్టాడు.

ఎద్దంత ఎత్తున్న ఆ తుప్పు సైకిలు మీద రామేశం అతి కష్టమ్మీద స్కూలుకెళ్తుంటే... అదేమి చిత్రమో కాని... వీధి కుక్కలన్నీ 'భౌ భౌ' మంటూ వెంటపడేవి. కొత్తలో వాటిని చూసి రామేశం జడుసుకున్నా, రాన్రానూ 'ఇళయరాజా మ్యూజిక్'లా అలవాటైపోయిందా మోత!

స్కూల్లో ఆ సైకిలుమీద వచ్చిన రామేశాన్ని చూసి పిల్లలంతా 'గుడ్డి గుర్రమెక్కి వచ్చాడంటూ' వెక్కిరించేవారు. 'అది బ్రిటిష్ రాణీగారి సైకిలు, తాను దివాన్‌జీగారి మనవడ్న'ని చెప్పుకున్నా ఎవడూ వినేవాడు కాదు. రీసెస్‌లో కేకులు కొనుక్కోడానికి డబ్బుల్లేని ఆడపిల్లలు రామేశంమీద, అతని సైకిలు మీద జోకులేసుకొని వికవిక నవ్వేవారు. రామేశంగాడి బండ సైకిలు పడి తమ బుజ్జి సైకిళ్ళెక్కడ పచ్చడైపోతాయోనని, పిల్లలంతా వెలివేసినట్టు రామేశం సైకిలుకి దూరంగా తమ సైకిళ్ళు పెట్టుకునేవారు.

క్రమేపీ... ఆ పాత సైకిలో పీడై కూచుంది రామేశానికి! దాన్ని తొక్కలేక చస్తున్నాడు వాడు. ఆసైకిలు పోయిందని చెప్తే తండ్రి కొత్త సైకిలు కొనిస్తాడేమోనని దాన్ని తీసుకెళ్ళి పల్లీలమ్మేవాడికీ, ఐస్‌క్రీం బండివాడికీ బేరం పెట్టబోతే, ఆ బోడి సైకిలు ఊర్నే ఇచ్చినా వద్దు పొమ్మన్నారు వాళ్ళు. ఆఖరికి మిఠాయిచ్చి పాత సామాను కొనేవాడి దగ్గర కూడా భంగపడ్డాడు రామేశం. వాడు 'అది అసలు పాత ఇనుమే కాదు, ఏదో పిచ్చ మెటలు' అని చెప్పి మరీ పోయాడు. దాంతో ఈ జన్మకి తనకా సైకిలు దరిద్రం వదల్దేమోనని బెంగెట్టుకుని క్లాసులెగ్గొట్టి మరీ వాల్తేరు పిచ్చాసుపత్రి చుట్టూ వున్న చెట్లెమ్మటా, పుట్లెమ్మటా తిరుగుతున్నాడు రామేశం.

ఓనాడు వాడలా... వల్లెహొక్కా, వల్ల ఎక్కరు వేసుకొని... బచ్చా దేవదాసు పోజులో... బీచ్ రోడ్డున సైకిలీడ్చుకుంటూ తిరుగుతుంటే... దూరంగా బీచ్ ఒడ్డున... చెడ్డీ తొడుక్కొని బైనాక్యులర్స్ లోంచి చూస్తున్న ఇంగ్లీషు పీనుగొకడు

గావుకేకలు పెడ్తూ కన్పించాడు. మొదట... వాడ్నే మొసలో పట్టుకుందేమోనని అనుమానమొచ్చినా... చివరకు వాడు తనను చూసే అరుస్తున్నాడని తెల్సిపోయింది రామేశానికి!

'కొంపదీసి ఆ కుర్రాడు ఇంగ్లీష్ జెంటిల్మాన్ దగ్గర ఏ కెమేరానో కాజేసి పోతున్నాడేమో'నని అనుమానించి రామేశం వెంటపడ్డాడో బీటు కానిస్టేబులు. ఈ హఠాత్సంఘటనలకు బెంబేలెత్తిన రామేశం తన సైకిలెక్కి స్పీడుగా ఇంటివైపు దౌడు తీశాడు. ఇంటిముందే సైకిలాపి... రొప్పుతూ... మెల్లగా ఇంట్లో నక్కలాగా నక్కి... తలుపు కంతల్లోంచి చోద్యం చూస్తున్నాడు.


కాస్సేపటికి... ఆ ఇంగ్లీషువాడూ, కానిస్టేబులూ చెట్టాపట్టాలేసుకుని వస్తూ... వీధిలో కనబడ్డ రామేశంగాడి సైకిల్ని చూసి తృప్తిగా నిట్టూర్చి, సుబ్బారావింటి బెల్లు నొక్కారు. పోలీసుని చూసి... చుట్టుపక్కవాళ్ళంతా సుబ్బారావు ఇంటి ముందు 'మలేరియా దోమల మంద'లా గుమిగూడారు. 'చెప్పే చరిత్ర వినకపోతే సుబ్బారావు ఎవడ్నో పొడిచేసుంటా'డని!

ఆ టైముకి వంటింట్లో బియ్యమేరుతున్న సుబ్బారావు ఇంటి ముందు హడావిడికి భయపడి, చొక్కాలేకుండానే బొందుల్నిక్కరుతో రోడ్డు మీదకొచ్చి పోలీసాయన్ని అడిగాడు ఏమయిందని. ఇంగ్లీషాయన్ని సుబ్బారావుతో మాట్లాడుకోమని ఇంట్లోకి పంపించి, లాఠీతో జనాన్ని పొమ్మని అదిలించాడు పోలీసు.

ఇంగ్లీషాయన చెప్పే వివరాలు విని అవాక్కయ్యాడు సుబ్బారావు!

సుబ్బారావు అనుకున్నట్టు అది ఆషామాషీ సైకిలు కాదట! ప్రపంచం మొత్తం మీద మొట్టమొదటిసారిగా తయారైన సైకిళ్ళు మూడింటిలో... అది ఒకటట! మిగతా రెండు సైకిళ్ళలో ఒకటి ప్రపంచయుద్ధ కాలంలో జర్మనీ బాంబు దాడిలో నాశనమైపోయిందట! రెండొది అమెరికాలో ఓ మ్యూజియంలో వుండగా... అగ్ని ప్రమాదం కారణంగా ఆహుతై పోయిందట. ఇక మిగిలిన మూడో సైకిలు ఇదేనని... నమ్మకంగా కొన్ని ఫోటోలు, డిజైన్లు చూపించాడు ఇంగ్లీషాయన. అవి అచ్చుగుద్దినట్టు సుబ్బారావు సైకిలుకి నకళ్ళలా వున్నాయి.

ఆ ఇంగ్లీషు పెద్దాయన పేరు 'జార్జ్ హెర్నింగ్స్' ప్రపంచంలోని అతి పురాతన వస్తువుల్ని వెతికిపట్టు కొని... వాటిని కొని (వీలైతే దొంగిలించి) లాభానికి మ్యూజియంలకు అమ్ముకోవడం అతని వృత్తి. ఈ సైకిలు ఇండియాలో వున్నట్టు లండన్ లైబ్రరీలో అతనికి దొరికిన కొన్ని వివరాల ఆధారంగా... రెండేళ్ళ బట్టీ నలుగురు డిటెక్టివ్‌లని నియమించి దీనికోసం అన్వేషిస్తున్నాడు. చివరకు పాత వాచీలు కొనే పని మీద హెర్నింగ్సే వైజాగ్ రావడం... బీచ్‌లో ఆ హిస్టారికల్ సైకిల్ ఆయన




కంటబడ్డం... యాధృచ్ఛికంగా జరిగింది.

మూడు తరాల ఇంగ్లాండు రాజ కుటుంబీకులు ఈ సైకిల్ని వాడారట! మొట్టమొదట ఇంగ్లాండు రాణీగారి భర్తే దీనిపై స్వారీ చేసేవారట. ఆయన లాన్‌లో ఈ సైకిలు తొక్కేటప్పుడు... కిందపడిపోకుండా ఓ అరడజనుమంది అంగరక్షకులు సైకిల్నే కంట కనిపెడ్తూ వుండేవారట! రెండో తరంలో... యువరాజు ఎడ్వర్డ్ ఫిలిప్ దీనిని పిచ్చుకల వేటకు వాడారట. మూడో తరంలో... రాణీగారి మనవడు ఓనాడు తుప్పల్లో సైకిలు తొక్కుతుండగా స్లిప్పయి... పప్పులా అణిగి... గాయాల్తో లోకం విడిచాడట!

అప్పుడా సైకిలుపై పగబూనిన రాణీగారు... దొంగ ప్రేమ నటిస్తూ... మరాఠీ రాజాగారికి ప్రెజెంట్ చేసి చేతులు దులుపుకున్నారట! అలా... అలా... ఆ సైకిలిప్పుడు రాజాగారి దివాను మనవడు రామేశం చేతుల్లో పడి మళ్ళీ చరిత్రకెక్కింది.

ఏది ఏమైనా... గవర్నమెంటు టాక్సులు కాకుండా... తానా సైకిలుకి 'ఎనభై లక్షల రూపాయలు' ముట్టచెబుతాననీ, త్వరగా ఆలోచించుకొని ఎగ్రిమెంటు రిజిస్ట్రేషనుకు సిద్ధం కమ్మని హెర్నింగ్స్‌గారు సుబ్బారావుకు నచ్చచెప్పి... బసచేసిన 'సీపార్క్' హోటలుకి పోయారు.

లాగి... తంతే... బంగారు బర్ఫీల బందులదొడ్లో పడ్డంత పనయ్యింది సుబ్బారావుకి! విషయం సడెన్‌గా చెబితే తన వైఫు సుబ్బలక్ష్మి స్వీటుహార్టు ఉఫ్ మంటుందేమోనని కంగారుపడి ముందే కార్డియాలజిస్టుకి కబురు చేశాడు. ఓన్లీ సన్ రామేశంగాడికి ఏకంగా కాంటెస్సానే కొనిస్తానని ఉబ్బేశాడు!

ఈ విషయం తుఫాన్ మేఘంలా... దేశమంతా వ్యాపించడంతో... టి.వి. విలేకర్లు, పత్రికా విలేకర్లు... సుబ్బారావుతో ఇంటర్వ్యూ కోసం అతని ఇంటి ముందు క్యూలు కట్టారు! అంత గొప్ప చరిత్రగల సైకిల్ని చూడకపోతే... ఇహ బతికెందుకు, చచ్చెందుకు అని... జనమంతా తండోపతండాలుగా సుబ్బారావింటివైపు తోసుకు రావడంతో... ఆ ప్రాంతంలో బందోబస్తు నిమిత్తం... ఆరు బెటాలియన్ల రిజర్వు పోలీసుల్ని 'రంగం'లోకి దించారు!

మర్నాటి పేపర్లలోనూ టీ.వీ.లోనూ... సుబ్బారావు సైకిలు స్పెషల్ న్యూసవడంతో.. స్టోరీలు దొరక్క గడ్డాలు గోక్కుంటున్న కొంతమంది ప్రొడ్యూసర్లు 'ది స్వోర్డ్ ఆఫ్ టిప్పు సుల్తాన్' లాగా 'ది సైకిల్ ఆఫ్ ఇంగ్లాండ్ ప్రిన్సెస్' పేరుతో టీ.వీ. సీరియల్ తీస్తామనీ... ఎలాగైనా, ఆ సైకిలు తమ సీరియల్లో నటించేలా ఒప్పుకోమనీ సుబ్బారావుపై ఒత్తిడి తెచ్చారు. ఎంత ఖర్చైనా ఆ సీరియల్ని... తామంటే తాము స్పాన్సర్ చేస్తామని, ధీరూభాయ్, కర్సన్‌భాయ్... వగైరాలంతా ఫోన్లమీద సుబ్బారావు కోసం ట్రై చేస్తున్నారు.!

ఇవన్నీ గమనించిన సుబ్బారావు... దేనికి, దేనికి... ఎంతెంత మొత్తం డిమాండు చెయ్యాలో సుబ్బలక్ష్మిని సంప్రదిస్తున్నాడు.

ఇప్పుడిప్పుడే చెత్తబుట్ట పాలయిన రచయిత్రిగా పేరు తెచ్చుకొంటున్న సుబ్బలక్ష్మి ఆసీరియల్ కి తానే కథ రాస్తానని పట్టుబడ్తోంది!

ఇప్పటిదాకా... ఆ సైకిలు తన హాండోవర్లోనే వుంది కాబట్టి... ఆ టీ.వీ. సీరియల్‌లో మెయిన్ రోల్ తానే చేస్తానని రామేశం ఫాదర్ని ఫోర్సు చేస్తున్నాడు!

లేటుగా... విషయం తెలిసిన స్పీల్ బర్గ్... ఆ సైకిల్‌తో తానే ఓ సీరియల్ తీసి బి.బి.సి. ద్వారా టెలికాస్ట్ చేస్తానని, సుబ్బారావుని సంప్రదించకుండానే... హాలీవుడ్‌లో... హడావిడిగా ప్రకటించేశాడు.

దాంతో... సుబ్బారావు 'బక్క లక్కు' ఒక్కసారిగా లక్ష లాటరీలు తగిలినంత గొప్పగా తిరగబడిపోయింది!

అయినా... సుబ్బారావు ఇంకా రుసురుసలాడుతూనే వున్నాడు. 'ఈ జనం అంతా తనను ఒకటే విసిగించేస్తున్నార'ని!

●